పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

ఖిలావరంగల్, ఆగస్టు 27: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యాటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కోటను సందర్శించనున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కీర్తితోరణాల మధ్య వేదికను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ సలీమా, ఆర్డీవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంల పరిశీలన

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల ఏఎంసీలోని 11, 12వ (డిస్ట్రిక్ గోదాం) ఈవీఎం స్ట్రాంగ్ రూంలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, వాచ్‌రూంలను తనిఖీ చేశారు. ఆమె వెంట డీటీ రంజిత్, సిబ్బంది ఉన్నారు.

బాలబాలికలకు క్రీడా పోటీలు

కాశీబుగ్గ, ఆగస్టు 27: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాశీబుగ్గ ఓసిటీ స్టేడియంలో మంగళవారం పాఠశాల స్థాయి బాలబాలికలకు జిల్లాస్థాయిలో కబడ్డీ, జూడో, రెజ్లింగ్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి 42 టీంలు పాల్గొన్నాయి. కబడ్డీలో 12, జూడోలో 12, క్రికెట్‌లో ఆరు, రెజ్లింగ్‌లో 12 టీంలు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి రెండు స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 29న ఓసిటీ స్టేడియంలో జరుగనున్న క్రీడా దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే, కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ చేతులమీదుగా జాతీయ క్రీడా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు డీఎస్‌డీవో సత్యావాణి తెలిపారు. అలాగే, 29న ఉదయం 9.30 గంటలకు వెంకట్రామ టాకీస్ నుంచి ఓసిటీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్లానింగ్‌ను కచ్చితంగా అమలు చేయాలి

పోచమ్మమైదాన్, ఆగస్టు 27: ఎయిడెడ్ అధ్యాపకులు అకాడమిక్ ప్లానింగ్‌ను కచ్చితంగా అమలు చేసి, మంచి ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. వరంగల్‌లోని ఇస్లామియా ఎయిడెడ్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అలాగే, వార్షిక పరీక్షల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇంటర్ బోర్డు నిర్దేశించిన ప్రకారం కళాశాలలో విధులు నిర్వర్తించాలని, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఉర్దూతోపాటు పోటీ పరీక్షల్లో కూడా తగిన శిక్షణ ఇవ్వాలని, ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కళాశాల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు బోధనా పద్ధతులను మెరుగు పర్చుకోవాలని, ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ గాను ఆడియో, వీడియోల మాధ్యమంగా బోధనా పద్ధతులకు సిద్ధపడాలన్నారు.

పనులను పరిశీలిస్తున్న సీడీఎంఏ వీపీ గౌతమ్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : సీడీఎంఏ

వరంగల్, ఆగస్టు 27: పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీడీఎంఏ వీపీ గౌతం అధికారులను ఆదేశించారు. మంగళవారం కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ కల్వర్టు పనులను పరిశీలించారు. కుడా చేపట్టిన ఉనికిచర్ల, మడిపల్లి వెంచర్లను సందర్శించారు. అనంతరం కుడా కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి సమీక్షించారు. సెప్టెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించనున్నందున త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, నయీంనగర్ బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, షేక్ రిజ్వాన్ బాషా, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజిత్‌రెడ్డి, హెచ్‌వో రమేశ్, బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్, కుడా ఈఈ భీమ్‌రావు, ఏఈ రాగి శ్రీకాంత్, సతీశ్ ఉన్నారు.

కొంకపాకలో పోలీసు కళాజాత

పర్వతగిరి, ఆగస్టు 27: కొంకపాకలో మంగళవారం రాత్రి పోలీసు జాగృతి కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలు మత్తుకు బానిస కావొద్దని కోరారు.

శివనగర్‌లో అగ్నిప్రమాదం

- రూ. 30 లక్షల వరకు ఆస్తినష్టం
- ఘటనా స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల పరిశీలన

మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఖిలావరంగల్, ఆగస్టు 27: శివనగర్‌లోని ఇసుక అడ్డా సమీపంలో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. సయ్యద్ పాషా ఓల్డ్ ఫర్నిచర్ షాపులో మొదలైన మంటలు.. పక్కనే ఉన్న బార్దాన్ షాపుతో పాటు ప్లైవుడ్ దుకాణానికి వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి ఫర్నిచర్ షాపులో మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, షాపు వెనకాలే ఉన్న జయ గన్నీస్ మర్చంట్‌లో మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారింది. దీంతో జేసీబీతో కర్రలు, రేకులతో పాటు అగ్నికీలలను తొలగిస్తూ ఫైర్ సిబ్బంది ముందుకెళ్లారు. అప్పటికే బార్దన్ షాపు కాలిబూడిదైంది. సుమారు రూ. 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిట్లు ప్రొప్రైటర్ ఊరటి వీరస్వామి తెలిపారు. ఘటనా స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరాం, మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య సందర్శించారు. ఖిలావరంగల్ రెవెన్యూ అధికారులు నష్టంపై అంచనా వేస్తున్నారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఆయన వెంటన 34వ డివిజన్ కార్పొరేటర్ కుమారస్వామి ఉన్నారు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే.. రెండు వర్గాల మధ్య చిచ్చు ఈ అగ్ని ప్రమాదానికి కారణమైందనే ఆరోపణలున్నాయి.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, ఆగస్టు 27: జిల్లాలోని జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎం జ్ఞానేశ్వర్ తెలిపారు. జనరల్ బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ. 50 https:\\ www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో వచ్చే నెల 11లోగా చెల్లించాలని డీఈవో కోరారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఎన్నికలకు నోటిఫికేషన్

గీసుగొండ, ఆగస్టు 27: జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్‌ను మంగళవారం ఎన్నికల కన్వీనర్ వంగేటి అశోక్‌కుమార్ వరంగల్ 15వ డివిజన్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో విడుదల చేశారు. సెప్టెంబర్ 1న నామినేషన్లు ప్రారంభం అవుతాయని తెలిపారు. 2న పరిశీలన, 3న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

మక్కలు @ రూ. 2885

కాశీబుగ్గ, ఆగస్టు 27: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2090 కాగా, రూ. 2,885 ధర పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన బరిగెల సంజీవ్ 30 క్వింటాళ్లు తీసుకురాగా, సంధ్య ట్రేడర్స్ అడ్డి ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ ఖరీదు వ్యాపారి కొనుగోలు చేశారు.

పోలీసులకు నిందితుడి అప్పగింత

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 27: ఎంజీఎం ఆవరణలో రోగులు, అటెండెంట్ల నగదు, వస్తువులను దొంగిలించేందుకు యత్నించిన దొంగను సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున గుర్తించారు. ఎంజీఎం మెడికల్ వార్డులో చికిత్స పొందుతున్న మహిళ మెడలోని ఆభరణాన్ని దొంగిలిస్తుండగా ఎంజీఎం ఏఎస్‌వో గొర్రె నాగరాజు అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్ఎంవోలు అభినందించారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

ఖిలావరంగల్, ఆగస్టు 27: బొల్లికుంట క్రాస్, రామకృష్ణాపురం, వాగ్దేవి కళాశాల ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ తిరుపతి, సీఐ రవికుమార్ పర్యవేక్షణలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. హాస్టళ్లల్లో ఉంటున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతి పత్రాలు లేని 95 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు.

నల్లా మీటర్ల అపహరణ

ఖిలావరంగల్, ఆగస్టు 27: శివనగర్ రుద్రమాంబనగర్‌లో కొద్ది రోజులుగా మహిళా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గుర్తుతెలియని మహిళలు ఉదయం కాలనీల్లో చక్కర్లు కొడుతూ రాత్రి వేళల్లో ఇంటి ముందు బిగించిన నల్లా మీటర్లను అపహరిస్తున్నారు. రుద్రమాంబనగర్‌లోని నాలుగు ఇండ్లలోని మిషన్ భగీరథ నల్లాలకు బిగించిన మీటర్లను తీసుకెళ్లడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల గస్తీ పెంచాలని కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : డీపీవో రాంరెడ్డి

నర్సంపేట రూరల్/చెన్నారావుపేట, ఆగస్టు 27: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో రాంరెడ్డి అన్నారు. నర్సంపేట, చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం ఆయన శానిటేషన్, ఓటరు లిస్టు తయారీపై కార్యదర్శులు, బీఎల్‌వోలతో సమీక్షించారు. త్వరలో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు లిస్టు రూపొందించి వచ్చే నెల 1లోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగు పర్చాలన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమీక్షలో నర్సంపేట, ఖానాపురం ఎంపీడీవోలు అంబాల శ్రీనివాసరావు, భారతి, ఎంపీవో, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లు, చెన్నారావుపేట ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

ఖానాపురం, ఆగస్టు 27: ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. అశోక్‌నగర్‌లో మంగళవారం నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, ఖానాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 212 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానికంగానే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, నర్సంపేట ప్రభుత్వ కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీవోఏలకు ఒకరోజు శిక్షణ

పర్వతగిరి, ఆగస్టు 27: మదర్ థెరిస్సా మండల సమాఖ్య ఆధ్వర్యంలో కిశోర బాలికల సంఘాలకు వీవోఏలకు మంగళవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకరనాయక్ మాట్లాడుతూ 15 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన బాలికలకు సంఘాలు ఏర్పాటు చేసి, వారి హక్కులు వారే పొందేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీసీలు రమాదేవి, కాంతయ్య, రవీందర్‌రాజు, సుధాకర్, వీవోఏలు ఎంఎస్‌వోబీ నాగమణి, లత పాల్గొన్నారు.

'డిక్లరేషన్ అమలు చేయాలి'

గీసుగొండ, ఆగస్టు 27: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుంటే ఉద్యమాలకు సిద్ధమవుతామని ఏబీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ హెచ్చరించారు. మండల కేంద్రానికి చెందిన రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. మహేందర్ దీక్షకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఉద్యమకారుడు కొమురయ్య, సురేశ్, సాంబయ్య, అనిల్, ధనలక్ష్మి, కొమురమ్మ, ఎల్లమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యం కావాలి

దుగ్గొండి, ఆగస్టు 27: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గ్రామ ప్రత్యేక అధికారి ఎల్.శారద కోరారు. గిర్నిబావిలో మంగళవారం గ్రామసభ జరిగింది. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. కార్యదర్శి నూనె వేణుప్రకాశ్, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కేజీబీవీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

సంగెం, ఆగస్టు 27: ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని, వారి చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జెండర్ స్పెషలిస్టు రమాదేవి అన్నారు. వంద రోజుల స్పెషల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా సంగెం కేజీబీవీలో మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. హక్కులు, బాధ్యతలు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. బాలికలు ఉన్నతంగా చదువుకుని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆపద సమయంలో 1098, 181, 100, 14567, 155326, 1930 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కరీమాబాద్, ఆగస్టు 27: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డాక్టర్ భరత్‌కుమార్ సూచించారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం టెలిమానస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఆయన సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావొద్దన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం బాధ్యులు

దరఖాస్తు ప్రక్రియను అందుబాటులోకి తేవాలి

గిర్మాజీపేట, ఆగస్టు 27: పీఎం విశ్వకర్మ యోజన గతేడాది సెప్టెంబర్ 17న ప్రారంభమైనా రాష్ట్రంలోని మీసేవ సెంటర్లలో దరఖాస్తు ప్రక్రియ అందుబాటులోకి రాలేదని, త్వరగా సమస్యను పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి చంద్రసేన, ప్రధాన కార్యదర్శి కట్టా రాజేందర్ సంఘం సభ్యులతో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు శ్రీరామోజు ఉపేంద్రచారి, సహాయ కార్యదర్శి కాసుల వరదరాజు, కమిటీ సభ్యులు ఉల్లి వినీల్, పీ కృష్ణ, ఎం జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

తాత్కాలికంగా డబ్బాల తొలగింపు

పోచమ్మమైదాన్, ఆగస్టు 27: శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బల్దియా సిబ్బంది తాత్కాలికంగా కొన్ని డబ్బాలను తొలగించారని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని గ్రేటర్ కార్పొరేషన్ అధికారులకు తాను చెప్పానని, ఎవరినీ ఇబ్బంది పెట్టడం తన అభిమతం కాదని పేర్కొన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేసిన విమర్శల నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు. రాజకీయాల కోసం ఇంకొకరిని ఇరుకున పెట్టడం సరికాదని హితవు పలికారు.

విషజ్వరంతో యువకుడి మృతి

నర్సంపేట, ఆగస్టు 27: విషజ్వరంతో యువకుడు మృతిచెందిన ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జయలక్ష్మి సెంటర్‌కు చెందిన సంకినేని కృష్ణ, రజిత దంపతుల కుమారుడు అర్జున్(17)కు జ్వరం వచ్చింది. జ్వర తీవ్రత పెరిగి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పటికే జ్వరం మెదడుకు చేరడంతో అర్జున్ మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. చేతికొచ్చిన కొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అర్జున్(ఫైల్)

'విద్యార్థుల పాత్ర కీలకం'

మట్టెవాడ, ఆగస్టు 27: నేర నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకమని షీ టీం సీఐ కె.సుజాత అన్నారు. మంగళవారం రామన్నపేటలోని కీస్ స్కూల్‌లో నేరాలు, లైంగిక దాడుల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలపై లైంగిక దాడులు, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను షేర్ చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు 8712685257, 8712685142, 8712685270 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ వై.విద్యాసాగర్, కె.వసంతలక్ష్మి, అనీస్, స్వాతి, వై.భవ్యనాగు, షీ టీమ్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ, కానిస్టేబుల్ కే వంశీకృష్ణ, ఉమెన్ కానిస్టేబుల్ సువార్త పాల్గొన్నారు.

నేటి గవర్నర్ పర్యటన వివరాలు..

హనుమకొండ, ఆగస్టు 27: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం హనుమకొండ, వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 9.15 గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.15 నుంచి 9.45 గంటల వరకు పబ్లిక్ రిప్రజెంటేటివ్‌తో ఇంటరాక్షన్‌లో పాల్గొంటారు. 10 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 10.10 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ గీతం ఆలపిస్తారు. మధ్యాహ్నం 12.15 గంటల వరకు కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, టీఎస్ఎన్జీవోలు, టీజీవోలు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో మాట్లాడుతారు. మధ్యాహ్నం 12.15 నుంచి 2.30 వరకు కవులు, కళాకారులతో ముచ్చటిస్తారు. అనంతరం అక్కడే భోజనం చేస్తారు. 3 నుంచి 4 గంటల వరకు రెడ్‌క్రాస్ ప్రోగ్రాంలో పాల్గొంటారు. 4 నుంచి 4.40 వరకు పద్మాక్షి దేవాలయం, 4.40 నుంచి 5.10 వరకు వేయిస్తంభాల గుడి, 5.10 నుంచి 5.50 వరకు భద్రకాళీ దేవాలయాన్ని సందర్శిస్తారు. 5.50 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి ఖిలా వరంగల్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.20 గంటల వరకు అక్కడే ఉంటారు. 6.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 6.40 గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు. 29వ తేదీ ఉదయం 9 గంటలకు జనగామ జిల్లాకు బయల్దేరి వెళ్తారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కరీమాబాద్, ఆగస్టు 27: ఫోర్టురోడ్డులోని శివశక్తి వినాయక మందిరంలో గణపతి శివలింగ నందీశ్వర సహిత పార్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా మంగళవారం రెండో రోజు ఆలయ ఆవరణలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **DEVULAPALLY SHASHIREKHA** (Old Name), W/o **DEVULAPALLY KOTESHWAR,** R/o. H.No.3-1-243/9/309, Kubera Homes, Kakatiya Colony, Hanumakonda City & Dist., Telangana State-506001., Hereby declare that I have changed my name as **DEVULAPALLY BHAVANI** (New Name) W/o **DEVULAPALLY KOTESHWAR."**

WANTED

jobs Apply Now!

★ప్రముఖ ఫైనాన్స్ సంస్థ యందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేయుటకు అనుభవం కలిగిన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను మరియు హన్మకొండ బ్రాంచిలో పనిచేయుటకు అనుభవం కలిగిన Lady Tele Caller కావలెను.
Cell: 8121225656, 8885558638.
NTW-320314

PLOTS FOR SALE

★HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. వెంటనే సంప్ర: 9553255936.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

పల్లె దవాఖానల్లోనూ హెచ్ఐవీ స్క్రీనింగ్ టెస్టులు

వరంగల్‌చౌరస్తా, ఆగస్టు 27: ఇకపై పల్లె దవాఖానల్లోనూ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) మరిన్ని హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని హనుమకొండ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ టి.మదన్‌మోహన్ అన్నారు. ఎంజీఎం అకాడమిక్ హాల్‌లో మంగళవారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనాల సేకరణ, పరీక్ష విధానంపై సూచనలు చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఐసీటీసీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తున్న ఈ స్క్రీనింగ్ పరీక్షలు, బాధితులకు మనోధైర్యాన్ని అందించే కౌన్సెలింగ్‌ను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో సైతం చేస్తారన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్

దీంతోపాటు పలు రకాల లైంగిక సంబంధిత వ్యాధులపై సమగ్ర విశ్లేషణను అందించారు. రోగి ఆరోగ్య స్థితి దృష్ట్యా హైరిస్క్ కేసులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికార